


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

ఆదివారం 31 మే 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3




## పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడమే శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ ధ్యేయం

భానుపురి/సూర్యాపేట టౌన్

ప్రతి పేద యాదవ విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, వారి విద్యభివృద్ధికి తోడ్పడటమే శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, శ్రీకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, 18 వార్డ్ కౌన్సిలర్ ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐఎంఎ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి లో 500 మార్కులు పైగా సాధించిన యాదవ విద్యార్థిని, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, నగదు పురస్కారం జనరల్ బాడీ సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవిద్యే సమాజాభివృద్ధికి మూలస్తంభమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువులకు దూరం కాకూడదనే సంకల్పంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించడానికిట్రస్ట్ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ముఖ్యంగా పేద, ప్రతిభావంతులైన యాదవ విద్యార్థులకు విద్యా సహాయం అందించడం, వారి ఉన్నత విద్య కోసం అవసరమైనమార్గదర్శకత్వం కల్పించడం ట్రస్ట్ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా తమ ప్రతిభతో దేశ, విదేశాల్లో రాణిస్తున్నారని, అలాంటి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు.



తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారిని ప్రోత్సహించాలని కోరారు. శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని విద్యా, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. చదువు అనేది ఏ రంగంలోనైనా స్థిరపడటానికి దోహదపడుతుందని చదువు అనేది వ్యక్తులకు గౌరవాన్ని విజ్ఞానాన్ని, వివేకాన్ని సమాజంలో గుర్తింపుని ఇస్తుందన్నారు. యాదవ సమాజంలోని దాతలు, ప్రముఖులు ముందుకు వచ్చి ట్రస్ట్ కార్యక్రమాలకు సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. సమాజ అభ్యున్నతికి విద్యతో పాటు సామాజిక చైతన్యం కూడా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ట్రస్ట్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాల విస్తరణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సహాయ సహకారాల అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. యాదవ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోని తల్లిదండ్రులకు, సమాజాని కి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.




## విద్యా పరిరక్షణ కమిటీ ధర్నా గోడ పత్రికలు,కరపత్రాల ఆవిష్కరణ

భానుపురి/సూర్యాపేట టౌన్

రోజురోజుకు కుంచించుకు పోతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని విద్యారంగ ప్రైవేటీకరణ కార్పొరేటీకరణను నియంత్రించాలని జూన్ 5వ తేదీన హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిర పార్క్ వరకు జరిగే ర్యాలీ మరియు ధర్నాను జయప్రదం చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేపాక లింగయ్య, టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముప్పాని కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు . విద్యా పరిరక్షణ కమిటీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు షేక్ ఉమర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న లతో కలిసి వారు సూర్యాపేట లో కరపత్రము మరియు గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పదేళ్ల కాలంలో నిర్లక్ష్యం చేయబడ్డ విద్యారంగం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో కూడా సమగ్ర విద్యాభివృద్ధి కొరకు చర్యలు చేపట్టిన దాఖలాలు కనబడడం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించి, ఖాళీలను భర్తీ చేసి ,మౌలిక వసతులు కల్పించాల్సింది పోయి, కొంతమంది విద్యార్థులకు మేలు చేసే విధంగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ ,స్కిల్ యూనివర్సిటీ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వంటి ఆకర్షణీయమైన పేర్లతో నూతన విద్యాలయాలను స్థాపించడం సరికాదన్నారు. ఈ విధమైనటువంటి విద్యారంగ విభజన ద్వారా సమాజంలో అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు.



ప్రభుత్వ విధానాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా రంగం పూర్తిగా కుంచించుకు పోయి ,ప్రైవేటు కార్పొరేట్ విద్యారంగం పెరిగే ప్రమాదం ఉందన్నారు. దీని ద్వారా బడుగు బలహీన వర్గాలకు, పేదలకు విద్య అందకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకై జూన్ 5వ తేదీన హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర ఉద్యమ కార్యక్రమం చేపట్టడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించిన విధంగా విద్యారంగానికి కనీసం గా 15% నిధులు కేటాయించాలని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు కళాశాలలు విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్థాపన యత్నాలను విరమించుకొని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సెమి రెసిడెన్షియల్ గా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పి బిక్షం, డిటిఎఫ్ నాయకులు బొల్లెద్దు వెంకటేశ్వరరావు ,కొచ్చర్ల వేణు, మున్నూరు నాగన్న, నకిరేకంటి వెంకన్న,బి దేవేందర్,ఏ రాంసింగ్, బి క్రాంతి కుమార్ , ఫజల్ అబ్ ఖాన్ , ఎం.డి సాహెబ్ అలీ,దామల్ల వెంకన్న, వి సైదులు, ఐ యాదగిరి, జె అబ్రహం, కెనడి ,టిపిటిఎఫ్ నాయకులు శిరగాని యాకయ్య, శీను, పి వై ఎల్ బాధ్యులు రవి, పి డి ఎస్ యు విద్యార్థి సంఘ నాయకులు ఎర్రా అఖిల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## తరచూ విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

### -లో-వోల్టేజ్, పవర్ కట్స్‌పై అధికారుల దృష్టి ఎప్పుడు?

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి



పట్టణంలో గత కొన్ని రోజులుగా తరచూ విద్యుత్ అంతరాయాలు చోటుచేసుకుంటుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కరెంట్ నిలిచిపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రత కొనసాగుతున్న సమయంలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో లో-వోల్టేజ్ సమస్యతో ఫ్యాన్లు, గృహోపకరణాలు సరిగా పనిచేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని పెంచకపోవడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వరి కొయ్యలను కాల్చకండి. పర్యావరణాన్ని పాడు చేయకండి

భానుపురి/సూర్యాపేట రూరల్



రైతులు వరి పంట కోసిన తర్వాత పొలం పై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, అందువల్ల ఎవరు వరి కొయ్యలను తగలబెట్టవద్దని ?జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విజ్ఞప్తి చేశారు. శనివారం అయన సూర్యాపేట మండలం కాసారాబాద్ గ్రామంలో వరి కొయ్యలను తగలబెట్టొద్దని రైతులకు అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరికోయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. సాంద్రత పెంచుకునేందుకు అధిక ఎరువులు వాడాల్సి వస్తుందని ఆ భారం కూడా రైతుల పైన పడుతుందని తెలిపారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు పరికరాలు తగలబడే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి కోయ్యలను తగలబెట్ట వద్దన్నారు. రైతులు వరికొయ్యలను తగలబెట్టకుండా ఉండేందుకుగాను వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలం పైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా, భూములు సారవంతం కోల్పోతాయని, అందువల్ల ఎవరు తగలబెట్టవద్దని చెప్పారు . ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాల సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎసిపి ప్రసన్న కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ బాలకృష్ణ, ఎడిఎ జ్ఞానేశ్వరి, ఎ ఓ కృష్ణ సందీప్, సర్పంచ్ బూపాల్ రెడ్డి ఇతర అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా పనిచేయాలి






భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహణలో నిష్పక్షపాతంగా పని చేయాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్ గారు సూచించారు. రాష్ట్ర స్థాయిలో పోలీసు అధికారులు, పోలీస్ కమీషనర్స్, జిల్లా ఎస్పీలు, క్షేత్ర స్థాయి అధికారులతో రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్ గారు ఈరోజు వీడియో కాన్సిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి గారు పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణ కొరకు పోలీస్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులతో, ఉద్యోగ నిర్వహణ, బాధితులతో స్పందించాల్సిన తీరు, దర్యాప్తులో పాటించాల్సిన ప్రణాళిక, విధులు నిర్వహణకు సిబ్బంది పాటించాల్సిన తీరు పై డిజిపి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి గారు మాట్లాడుతూ జిల్లాలో సిబ్బంది విధులు నిర్వహణ, గస్తీ నిర్వహణ, పిర్యాదులు నిర్వహణ, 100 కాల్స్ పై స్పందన, బాధితుల ఇంటి నుండి కేసుల నమోదు కార్యక్రమం అంశాల గురించి జిల్లా పోలీసు అవలంభిస్తున్న విదివిధానాల గురించి వివరించారు. అనంతరం ఎస్పి నరసింహ ఐపిఎస్ గారు జిల్లా పోలీసు అధికారులతో జిల్లా స్థాయి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. సిబ్బంది అందరూ సామర్థ్యంతో పనిచేయాలని విధుల నిర్వహణలో అలసత్వంగా ఉండకూడదని సూచించారు, ప్రణాళిక ప్రకారం కేసుల దర్యాప్తులో పనిచేయాలని అన్నారు. ఎల్లప్పుడూ కమ్యూనిటీ కార్యక్రమాలతో ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు, సిబ్బంది వారి యొక్క ఆరోగ్యాలపై దృష్టి సారిస్తూనే విధులు నిర్వహణలో చురుకుగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో పోలీసు అధికారులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని, ఫిర్యాదుల నిర్వహణపై రాష్ట్ర స్థాయిలో ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నారని తెలిపారు. ఫిర్యాదులు, కేసులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వేగంగా దర్యాప్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం నందు ఎస్పి గారి వెంట అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఎస్పీ లు ప్రసన్న కుమార్, రవి, నరసింహ చారి, సిఐ లు, అర్ఐ లు, ఎస్ఐ లు, అర్ఎస్ఐ లు, సిబ్బంది ఉన్నారు.

# సుదీర్ఘకాలం పోలీసు శాఖలో సేవలు అందించడం అభినందనీయం



భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్ గా పని చేస్తున్న గోపాలరావు ఉద్యోగవిరమణ పొందినారు. ఈ సందర్భంగా ఉద్యోగవిరణ పొందిన కానిస్టేబుల్ ని వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో జిల్లా పోలీస్ కార్యలయంలో ఎస్పి కె.నరసింహ ఘనంగా సన్మానించారు, ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు డిపార్ట్మెంట్ నందు సుదీర్ఘకాలం సేవలు అందించడం గొప్పవిషయం అని, అభినందనీయం అని వారి సేవలను అభినందించారు, ఈ ఉద్యోవిరమణ అనంతరము వారి కుటుంబ సభ్యుల అందరితో సుఖ సంతోషలతో గడపాలని అని, ప్రజా సేవలో పాల్గొనాలని కోరుకుంటున్నాము అని తెలిపినారు. రిటైర్మెంట్ అనేది వయస్సు కే కానీ మనసుకు కాదు నచ్చిన పనిలో కృషి చేయాలని అన్నారు.అధికారులు, తోటి ఉద్యోగులు, స్నేహితులు బంధువులు మాట్లాడుతూ విధులలో అంకితభావంతో, బాధ్యతతో పని చేసేవారనీ, కష్టపడే తత్వం కలవారని, అధికారులకు, క్రిందిస్తాయి సిబ్బందితో కలుపుకుని పోయేవారు అని తెలిపినారు.. ఈ కార్యక్రమంలో ఏవో మంజు భార్గవి, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్సై రామచందర్, ఆర్ఐ ప్రవీణ్ కుమార్, వెల్ఫేర్ ఎస్ఐ సాయిరాం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అధికారులు బాధ్యతగా పనిచేయాలి







భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్.

రోడ్డు ప్రమాదాల నుండి ప్రజల ప్రాణాలను కాపాడడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని దీనిలో అన్ని శాఖల అధికారులు బాధ్యత తీసుకుని రోడ్డు భద్రత చర్యల్లో భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ వి సి హాల్ నందు జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవే అధికారులు, ఆర్ అండ్ బి, రైల్వే అధికారులు, ఇరిగేషన్, ఆర్టీవో, ఎడ్యుకేషన్, డిఎంహెచ్వో, పోలీస్ అధికారులు, జిల్లా అధికారులతో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం సంబంధించి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా ఎస్పీ కె నరసింహ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండ ప్రజలకు అవగాహన కల్పించడానికిరోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలలో జిల్లా యంత్రాంగం బాధ్యతగా తీసుకొని ప్రజలను, విద్యార్థులను, యువత ను చైతన్యవంతం చేయాలని సూచించారు. రహదారుల పైన లోపాలను గుర్తించి సవరించాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు పెద్ద ఎత్తున గ్రామాలలో రోడ్డు భద్రత అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులను భాగస్వామ్యం చేసి రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమవుతున్న సందర్భంగా స్కూల్ బస్సులపై తనిఖీలు చేసి బస్సు లు ఫిట్నెస్ గా ఉన్నాయో లేదో పరిశీలించాలని రవాణా, పోలీస్ శాఖ అధికారులు ఆదేశించారు అలాగే స్కూలు దేవాలయ పరిసర ప్రాంతాలలో మాదకద్రవ్యాలు, బెల్ట్ షాపులు నిర్వహించకూడదని. పాఠశాలల వద్ద ఉన్న పాన్ షాపులపై నిఘ ఉంచి అక్కడ ఎలాంటి పాన్ పరాగ్, గుట్కాలు, గంజాయి అమ్మకుండా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ గ్రామాలలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలని, గ్రామ శివార్లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని, స్కూల్ జోన్లో రూల్స్ పాటించాలని, స్కూల్ బస్సులో ఫిట్నెస్ గా ఉండాలని ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేయటం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, అన్ని కార్యాలయాల వద్ద నో హెల్మెట్ నో ఎంట్రీ అని బోర్డ్ పెట్టాలని సూచించారు. గోల్డెన్ హావర్ గురించి అవగాహన కల్పించి రోడ్డు ప్రమాద ఘటనల్లో క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించి ప్రాణాలు కాపాడాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమయంలో పౌరులు బాధ్యతగా ఉండాలని, ప్రమాద సంఘటనల్లో సహాయ సహకారాలు అందించే వారికి లీగల్ గా ఎలాంటి ఇబ్బందులకు గురి చేయడం జరగదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రమాదం పై సమాచారం అందించే డయల్ 100, 112, 108 ల గురించి ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వీటితో పాటు ప్రథమ చికిచ్చ, గోల్డెన్ హవర్ పై క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలకు అధిక లోడు తో వాహనాలు కారణమవుతాయని, ఆటోలలో, ట్రాలిలలో ఎక్కువ మందితో ప్రయాణం ప్రమాదకరమని తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఎంహెచ్వో వెంకటరమణ, డీఈవో అశోక్, ఆర్టిఓ జయప్రకాశ్ రెడ్డి, డి పి ఓ యాదగిరి, డ్రగ్ ఇన్స్పెక్టర్ సురేందర్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి







భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

కిశోర బాలికలు ఇలాంటి చక్కని అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకాంక్షించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారంసూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'స్నేహ మాక్ పార్లమెంట్' కార్యక్రమం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహించారు. ఈ ముగింపు వేడుకలకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టుదల, వ్యక్తిత్వ వికాసం, మంచిఅలవాట్లతోనే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని వివరించారు. అనంతరం బాలికలందరూ కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖలకు సందర్శించి జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**-ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన**

ఈ మాక్ పార్లమెంట్లో సూర్యాపేట జిల్లాలోని 23 మండలాల నుండి 15-18 సంవత్సరాల వయస్సు గల 212 మంది కిశోర బాలికలు సభ్యులుగా పాల్గొన్నారు. జక్కలి రూప స్నేహ చంద్ర స్పీకర్గా వ్యవహరించిన ఈ సభలో బాలికలు ప్రజాస్వామ్య వ్యవస్థ, నాయకత్వ లక్షణాలు, మరియు సమాజంలోని పలు కీలక సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కిశోర బాలికల ప్రగతి, సంఘాల స్థితిగతులు, బాలికల భద్రత, రక్షణ మరియు విద్య, బడి మానేసిన బాలికలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, ఓపెన్ స్కూల్ అవకాశాలు, పారిశుధ్యం, ఆరోగ్యం, ఐరన్ మాత్రలు, శానిటరీ నాప్కిన్స్ పంపిణీ, రవాణా సౌకర్యాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, 'స్నేహ' సంఘాల బలోపేతం పై చర్చించారు.సభలో బాలికలు తమ గ్రామాలు, పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి, ప్రజాప్రతినిధుల తరహాలోనే బాధ్యతలను అర్థం చేసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన అంశాలపై తీర్మానాలు చేశారు.

**-ముగిసిన 99 రోజుల వారోత్సవాలు**

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మే 25 నుండి ప్రారంభమైన వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మే 25న గ్రామ, మండల స్థాయిల్లో కొత్త ఐఎంఎస్ భవనాల శంకుస్థాపన, మే 27 సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రారంభోత్సవం, జనరల్ బాడీ సమావేశాలు, మే 28న ఇంక్యుబేటర్ కార్యక్రమాల ప్రారంభం, రుణ మేళాలు, మే 29న జీవనోపాధి యూనిట్ల స్థాపన, సామాజిక సమీకరణ, మే 30న ఉపాధి కార్యక్రమం, కిశోర బాలికల ముగింపు సభ (మాక్ పార్లమెంట్) నిర్వహించారు.ఈ ముగింపు కార్యక్రమంలో డీఆర్డీఓ ఆర్. సన్యాసయ, డిఎంహెచ్వో వెంకటరమణ, డిఇఓ అశోక్, డిడిడిటిఓ శంకర్, అడిషనల్ డీఆర్డీఓ ఎ. సురేష్, డీపీఎం, ఏపీఎంలు, సీసీలు, సఖి భరోసా కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పదేండ్లలో కేసీఆర్ రైతుల మీటర్లకు మోటర్లు పెట్టలేదు



భానుపురి/సూర్యాపేట టౌన్

తెలంగాణ రైతాంగం పాలిట ఉరితాడుగా మారనున్న మూడవ డిస్కం ఏర్పాటును బి ఆర్ ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఈ విషయంలో రైతుల పక్షాన బి ఆర్ ఎస్ ముందుండి పోరాడుతుందని బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కెసిఆర్ చేసిన రైతు అనుకూల కార్యక్రమాలు రైతుబంధు, ఉచిత విద్యుత్తు, ధాన్యానికి ధర ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తుందన్నారు. మూడవ డిస్కం తీసుకొస్తామని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ముందు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టక తప్పదనడం రైతులను నిలువున మోసం చేసే ప్రయత్నమే అన్నారు. రైతులు కరెంటు ఎంత వాడుతున్నారో తెలియడం లేదని కాబట్టి రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడం తప్పదు కాబట్టి మూడవ డిస్కం పెడతమనడం సిగ్గుచేటు అన్నారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కేసీఆర్ 24 గంటలు రైతుకు ఉచిత కరెంటు అందజేశారని రైతుల మోటార్లకు మీటర్లు పెడితే నాటి బిజెపి ప్రభుత్వం 30 వేల కోట్ల సబ్సిడీ ఇస్తామన్న లొంగలేదన్నారు. నా మెడ మీద తలకాయ ఉన్నంత వరకు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేది లేదని తెలంగాణలో కేసీఆర్ తిరస్కరించాడన్నారు. మళ్లీ మీరు తెలంగాణలో రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేందుకు ప్రయత్నిస్తూ పది నుంచి 15 వేల కోట్ల రూపాయల వ్యాపారాన్ని ఆదానీ, అంబానీ లకు అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లకు కక్కుర్తి పడుతూ రైతుల మెడకు ఉరితాడు బిగిస్తుందన్నారు. మూడవ డిస్కం ఏర్పాటును బిఆర్ఎస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని రైతుల పక్షాన ముందుండి పోరాడుతుందన్నారు. నిన్న జరిగిన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి రైతులకు 24 గంటల కరెంటు అవసరం లేదని మూడు గంటలు ఉంటే చాలని మాట్లాడడం రైతులను ఆగ్రహానికి గురి చేస్తుందన్నారు.

## సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని బీసీ వర్గాలకు కేటాయించాలి


భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని బీసీ నాయకులకు కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు బీసీ వర్గాలు పార్టీ బలోపేతానికి కీలకంగా పనిచేస్తూ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ విజయాలకు, పార్టీ కార్యక్రమాల నిర్వహణకు, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లడంలో బీసీ నాయకులు, కార్యకర్తలు విశేష కృషి చేశారని అన్నారు. అయినప్పటికీ పార్టీ పదవుల కేటాయింపులో బీసీలకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్న తరుణంలో, పార్టీ సంస్థాగత పదవులలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ముఖ్యంగా సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని బీసీ నాయకుడికి కేటాయించడం ద్వారా పార్టీ బీసీ వర్గాల పట్ల ఉన్న నిబద్ధతను చాటుకోవచ్చని తెలిపారు.బీసీ వర్గాలు సమాజంలో అత్యధిక జనాభా కలిగిన వర్గమని, వారి ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ నిర్ణయాలు ఉండాలని అన్నారు. పార్టీ అధిష్ఠానం సామాజిక సమతుల్యతను పాటిస్తూ, అర్హత కలిగిన బీసీ నాయకుడికి పట్టణ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిద్ర సంపత్ నాయుడు మాట్లాడుతూ, "బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడమే నిజమైన సామాజిక న్యాయం. సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని బీసీ నాయకుడికి ఇవ్వడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుంది. బీసీ వర్గాల ఆకాంక్షలను గౌరవిస్తూ పార్టీ అధిష్ఠానం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాము" అని అన్నారు.

## గరిడేపల్లి మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కటకం వేణు

భానుపురి /గరిడేపల్లి



భారీ నీటిపారుదల అండ్ సివిల్ సప్లై శాఖ మంత్రివర్యులు అయినటువంటి టైగర్ ఉత్తంకుమార్ రెడ్డి ఆశీస్సులతో గరిడపల్లి మండల సర్పంచులు ఫోరం అధ్యక్షుని ఎన్నిక గురించి చర్చించటం జరిగినది. సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్ అధ్యక్షతన జరిగిన గరిడేపల్లి మండల సర్పంచ్లుల ఫోరం అధ్యక్షుని ఎన్నుకోవడం జరిగింది దీనికి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కటకం వేణు పొనుగోడు సర్పంచ్ ఉపాధ్యక్షులుగా అరుణ రమేష్ గారకుంట తండా సర్పంచ్ ప్రధాన కార్యదర్శిగా కీసర వెంకటరమణ బుచ్చయ్య వెంకట్రాంపురం సర్పంచ్ వీరు తోపాటు పాత కార్యవర్గాన్ని కొనసాగించడమైనది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు త్రిపుర అంజరెడ్డి మాజీ ఎంపీపీ కటికం ఆశా రమేష్ మాజీ ఎంపీపీ రంగనాథ్ మాజీ జెడ్పిటిసి పెండెం శ్రీనివాస్ గౌడ్ వివిధ గ్రామ శాఖ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు పరమేశ్ సందీప్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల బస్ పాస్‌ల గడువు జూన్ 16 వరకు పొడిగింపు

భానుపురి/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ సమాచార మరియు పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ జి. ముకుంద రెడ్డి ఉత్తర్వుల మేరకు, రాష్ట్రంలోని జర్నలిస్టులకు జారీ చేసిన బస్ పాస్‌ల చెల్లుబాటు గడువును 16 జూన్ 2026 వరకు పొడిగించారు.అక్రిడిటేషన్ కార్డుల గడువును కూడా ఇదే తేదీ వరకు పొడిగించినందున, ప్రస్తుతం అమల్లో ఉన్న అన్ని రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్ట్ బస్ పాస్‌లను ఈ నెల 16 వరకు చెల్లుబాటు అయ్యేలా పరిగణించాలని టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆ శాఖ కోరింది.ఈ మేరకు లేఖ నెం. 003491/MR/2024, తేదీ 29.05.2026 జారీ చేయబడింది. ఇందులో కాపీని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్, మల్టీ జోన్-I & II ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, రాష్ట్రంలోని అన్ని జిల్లా పౌర సంబంధాల అధికారులకు అందజేశారు.

## బెలిదె శ్రీనివాసులు ను గెలుపును కాంక్షిస్తూ బైక్ ర్యాలీ



భానుపురి /సూర్యాపేట టౌన్

ఆదివారం రవి మహల్ లో జరిగే సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష ఎన్నికల్లో బెలిదే శ్రీనివాస్ లు ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆర్యవైశ్యులు బైక్ ర్యాలీ ని జిల్లా కేంద్రంలో శనివారం పోస్ట్ ఆఫీస్ వద్ద ప్రారంభమై పీఎస్ఆర్ సెంటర్, వాణిజ్య భవన్, ఖమ్మం క్రాస్ రోడ్, కొత్త బస్టాండ్ కుడ కుడ రోడ్, కూరగాయల మార్కెట్, నిర్మల హాస్పిటల్ రోడ్ వరకు ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో పలు వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బెలిదే శ్రీనివాస్ లు మాట్లాడుతూ తనను గెలిపిస్తే అందరివాడుగా ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు తూచ తప్పక అమలు చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. తనను ఒక్కసారి ఆశీర్వదిస్తే సేవ చేసి చూపిస్తానని అన్నారు. కర్మకాండల భవనము ఏర్పాటు కు,పేద ఆర్యవైశ్యులు, పేద విద్యార్థుల ను ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధి కి కృషి చేస్తానని పేర్కొన్నారు. బైక్ ర్యాలీలో రాచకొండ శ్రీనివాస్, గుండా (సుమన్) వెంకన్న, మిట్టపల్లి రమేష్, బికుమల్ల కృష్ణ, ఉప్పల శ్రవణ్ కుమార్, బొల్లం సురేష్, బోనగిరి కృష్ణ, సోమ వెంకన్న, సోమ ప్రవీణ్, పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు

# ఘనంగా కలకోట లక్ష్మయ్య ఆత్మీయ సమ్మేళనం










భానుపురి/సూర్యాపేట

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రవి మహల్ లో సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులుగా పోటీ చేస్తున్న కలకోట లక్ష్మయ్య ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సోమనర్సయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలకోట లక్ష్మయ్య గెలిపిస్తే పేద ఆర్యవైశ్యుల కర్మకాండ భవన కొరకు ఇమ్మడి సోమ నరసయ్య ఐదు లక్షల రూపాయలు ఇస్తానని విరాళము ప్రకటించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ పోతుగంటి వెంకటేశ్వర్లు 51 వేల రూపాయలు ప్రకటించి తమ దాతృత్వాలు చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కలకోట లక్ష్మయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



## జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకల ఏర్పాట్ల పరిశీలన




భానుపురి/యాదాద్రి భువనగిరి

జూన్'2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పనులు అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్... వేడుకలు నిర్వహించే ప్రాంగణం, జెండా ఆవిష్కరణ స్థలం, పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఏర్పాట్లు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు సలహాలు చేశారు.రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, సక్రమంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డి , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల ప్రతినిధుల సభ

**-సభను విజయవంతం చేయాలని ఉద్యమకారులకు గుండెపంగు రమేష్ పిలుపు**

భానుపురి/ కోదాడ:

హైదరాబాద్‌లో నేడు 31న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ పిలుపునిచ్చారు.శనివారం సూర్యాపేట జిల్లా,కోదాడ పట్టణంలో నిర్వహించి జిల్లా స్థాయి ఉద్యమకారుల ముఖ్య నాయకుల సమావేశంలో అయన మాట్లాడుతూ...హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రతినిధుల సమావేశానికి కేకే కమిటీ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు,గుర్తింపు,సంక్షేమ అంశాలపై కేకే కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా చర్చించే అవకాశాన్ని ఉద్యమకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీని ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు.ఉద్యమకారుల తరఫున సూచనలు,సలహాలు కమిటీకి అందజేసి ఉద్యమకారుల హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఇచ్చిన హామీని అమలు దిశగా చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రామారావు,రాష్ట్ర నాయకులు తుపాకుల భాస్కర్,రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎండి మజీహర్, కుక్కడపు బాబు,ఏనుగుల యల్లేశ్వరరావు,మట్టపల్లి శ్రీనివాస్,కోదాడ మండల అధ్యక్షుడు కోళ్లూరి వెంకటేశ్వర్లు, అనంతగిరి మండల అధ్యక్షుడు సైదులు నాయక్,మునగాల మండల అధ్యక్షుడు పోలంపల్లి వెంకటేశ్వర్లు,తోటపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యం




భానుపురి/యాదాద్రి భువనగిరి

ప్రజాస్వామ్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా మాక్ పార్లమెంట్ నిర్వహణ ఉద్దేశ్యం అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ – గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్నేహ సంఘాల సభ్యుల మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హక్కులు, బాలికల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎంపికైన బాలికలు సభాపతి, మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు, ప్రజా ప్రతినిధుల పాత్రలను పోషిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా అనుభవించారు. సభా నిర్వహణ, చర్చలు, ప్రశ్నోత్తరాల ద్వారా తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరిచారు. మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల భద్రత, విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, పోషకాహారం, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలు తమ హక్కులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించేందుకు మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యుక్త వయసు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందే ఈ స్నేహ సంఘాలు అని, ప్రతి గ్రామ పంచాయతీలో ఈ సంఘాలు ఏర్పాటు అయ్యాయన్నారు. బాలికల రక్షణ, సంరక్షణ కింద బాల్య వివాహాల నిర్మూలనకు 1098 చైల్డ్ లైన్ నంబర్ లో సంప్రదించాలని అన్నారు.బాలికలు విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే స్థాయికి ఎదగాలని సూమాట్లాడుతూ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ యుక్త వయసు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందే ఈ స్నేహ సంఘాలు అని, ప్రతి గ్రామ పంచాయతీలో ఈ సంఘాలు ఏర్పాటు చేశారు.ఈబాలికలు విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. జీవితంలో ఏ రంగాన్ని ఎంచుకున్నా కష్టపడి పనిచేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. అనంతరం మాక్ పార్లమెంట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ అధికారి నర్సింహారావు, అడిషనల్ డి ఆర్ డి ఓ సురేష్, డి ప్యూటీ సీ ఈ ఓ శ్రీనివాస్,ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.